# తల్లిప్రేమ

## ఎస్. శశికళ

“ఏమిటోనండీ! మన అమ్మాయి ఉమ ఈడు వాళ్లందరికీ పెళ్లిళ్లయిపోయాయి. దీనికి 26 ఏళ్లు వస్తున్నాయి. ఇది మాత్రం మన గుండెల మీద కుంపటిలా ఉండిపోయింది.

“అదేమిటే రాజ్యం అలా అంటావు... మన అమ్మాయికేం తక్కువ? చక్కగా చదువుకుంది. చిదిమి దీపం పెట్టవచ్చు. పైగా బ్యాంకు ఉద్యోగం చేస్తూ నెలకు 25 వేలు సంపాదిస్తోంది. సంసారపక్షంగా ఉన్న మన అమ్మాయిని వెదుక్కుంటూ ఎవరైనా వస్తారు” అన్నాడు పరంధామయ్య.

“అలా కలలు కంటూ కూర్చోండి. ఉద్యోగాలు చేస్తున్నా, ఊళ్లేలుతున్నా ఆడపిల్లను వెదుక్కుంటూ ఎవరూ రారు. మనమే వెదుక్కోవాలి” అంది రాజ్యం ఉక్రోషంగా.

“అవును రాజ్యం మనమింక ఆలస్యం చేయకూడదు. ఇప్పటికే ఇరుగుపొరుగువారు చెవులు కొరుక్కుంటున్నారు. మనం మన అమ్మాయి ఉద్యోగం చేసి సంపాదిస్తున్న డబ్బులకాశపడి పెళ్లి ప్రయత్నాలు చెయ్యడంలేదట. ఏం లోకం...! పిల్లల సంపాదనకు ఆశపడి పెళ్లి ప్రయత్నాలు చెయ్యని తల్లిదండ్రులు ఉంటారా? ఈ జనానికి నోరెలా వస్తోందో?”

“లోకులు కాకులండీ! ఎలా అయినా కూస్తారు. అందుకే మనం ఇంకొకరికి అవకాశం ఇవ్వకూడదు. మన మీద మాట పడకుండా చేసుకోవడం మంచిది. ఇప్పటికైనా మించిపోయింది లేదు. మన అమ్మాయి సంపాదనను దాని పేరు మీదే బ్యాంకులో వేస్తున్నా మన్న సంగతి మనం లోకానికి చాటవలసిన పని లేదు. మీ స్నేహితుడు నాగేంద్రయ్య గారు మనవాళ్లలో సంబంధాలు చూస్తూ ఉంటారుగా... మన పరిస్థితులన్నీ ఆయనకు బాగా తెలుసు కదా! ఆయనకి చెప్పండి సంబంధాలు చూడమని” అని రాజ్యం సలహా ఇవ్వడంతో సరేనన్నాడు పరంధామయ్య.

రోజులు భారంగా గడుస్తున్నాయి. పెళ్లి విషయంలో ఉమకు కొన్ని కోరికలున్నాయి. తనలాగే చదువుకున్నవాడు, తన స్థాయిలోగాని, తనకు మించిన స్థాయిలో గానీ ఉద్యోగం చేసేవాడూ అయితే ఈడూ జోడూ బాగుంటుందని భావించేది. కానీ అన్నీ మనం అనుకున్నట్లు జరగవు కదా! బాగా చదువుకున్నవాడు ఉద్యోగం లేకపోయినా కట్నం దగ్గర హద్దులు లేకుండా ఉంటున్నాడు. ఉద్యోగం చేసేవాడైతే మరింత బెట్టు చేస్తున్నాడు.

“మనం అనుకున్నట్లు జరగాలంటే కుదరదమ్మా, సర్దుకుపోవాలి. ఎన్నాళ్లిలా పెళ్లికాకుండా ఉంటావు? మా తమ్ముడు బావమరిది కృష్ణయ్య ఒక సంబంధం తెచ్చాడు. అబ్బాయి డిగ్రీ చదివాడట. ఏదో ఆఫీసులో యు.డి.సి.గా పనిచేస్తున్నాడట. కుటుంబానికి పెద్ద అతడేనట. ఒక తమ్ముడు, చెల్లి ఉన్నారు. నువ్వు ఊ... అంటే వచ్చి చూస్తామన్నారు.”

అమ్మ చెప్పిన మాటల్ని వింటున్న ఉమకు ఈ లోకం అంటేనే అసహ్యం కలుగుతోంది. ఇంత చదువు చదివి ఉద్యోగం చేస్తున్నా పెళ్లి దగ్గరకు వచ్చేటప్పటికి తన కోరికల్ని చంపుకోవలసి వస్తోంది. ఇటు తల్లిదండ్రుల వత్తిడి, అటు లోకం సూటిపోటి మాటలు... సర్దుకుపోవడంలోనే జీవితం సరిపోతోంది. ఏం చేస్తాం! ఖర్మ అనుకుంటూ అమ్మ మాటలకు నిర్లిప్తంగా “సరే రమ్మనండి” అంది.

పెళ్లికొడుకు వైపువారు వస్తున్నారని ఉమ బ్యాంకుకు సెలవుపెట్టి ఆ రోజు ఇంట్లోనే ఉండిపోయింది. అమ్మ కంగారు, తండ్రి హడావుడి... అమ్మానాన్నల అవస్థ చూస్తే ఉమకి ఆడపిల్లని కన్న తల్లిదండ్రులకు ఇలాంటి అవస్థ తప్పదు కదా! అనిపించింది. పెళ్లికొడుకు వైపువారు వచ్చారు. పలకరింపులయ్యాయి. టిఫిన్లు, టీలు పూర్తయ్యాయి. ఉమ జీతం గురించి ముందే తెలుసుకున్న పెళ్లికొడుకు ఉమను చూడగానే ముచ్చటపడిపోయాడు. జీతం బాగా ఉండడమే కాదు, అమ్మాయి కూడా బాగుండడంతో రామారావు

సంబరపడ్డాడు. రామారావు చిన్న ఉద్యోగమే చేస్తున్నా ముచ్చటగా ఉండడంతో సర్దుకుపోవచ్చులే అనుకుంది. రామారావు తల్లికి ఉమ నిదానం, ఒద్దిక నచ్చాయి. ఇద్దరికీ అంగీకారమైతే ఇక మిగిలిన విషయాలు మాట్లాడుకోవచ్చు మధ్యవర్తిగా వచ్చిన కృష్ణయ్య అనడంతో అసలు విషయంలోకి వచ్చారు.

పెళ్లికొడుకు తల్లి "మీ అమ్మాయి మాకు బాగా నచ్చింది. మాకు కట్నం ఏమీ వద్దు. అయితే పెళ్లి అయిన తరువాత మీ అమ్మాయి సంపాదన నుంచి ఒక్క రూపాయి కూడా మీరు ఆశించకూడదు" అనడంతో ఉమ తల్లిదండ్రులు "అయ్యో! ఎంతమాట! మా అమ్మాయి సంపాదన మేమెప్పుడు ఆశించలేదు. తప్పకుండా మీరు చెప్పినట్లే జరుగుతుంది" అన్నారు.

మరికొన్ని రోజుల్లో మంచిరోజు చూసి ముహూర్తం పెట్టుకుందామనుకున్నారు.

పెళ్లికి ఉమ నెలరోజులు సెలవు పెట్టింది. ఉమ అక్క శారదని పెళ్లికి పదిరోజులు ముందే రమ్మని ఫోన్ చేసారు. శారద తన ఇద్దరు పిల్లలతో పుట్టింటికి వచ్చింది. ఇంటికీ పెళ్లికళ వచ్చింది. 'అది కొనాలి, ఇది కొనాలి...' అంటూ రాజ్యం కంగారు... 'మేమున్నాంలే... నీకెందుకు అంత హడావుడి' అంటూ పరంధామయ్యగారి భరోసా. అక్కాచెల్లెళ్లకి షాపింగులతో కాలం తెలియలేదు. పెళ్లి పెళ్లి అనుకుంటూ ఉండగానే ఆ రోజు రానే వచ్చింది.



సర్దుకుపోవడానికి అలవాటుపడ్డ ఉమ రంగురంగుల పూలతోరణాలతో అలంకరించబడిన కళ్యాణ మండపంలో రామారావు అర్ధాంగి అయిపోయింది.

తల్లిదండ్రుల్ని వదిలి వెళ్లాలన్న ఆలోచనతో ఉమ ఎంతో దిగులుపడింది. కానీ తనొక మంచి ఇంటికి కోడలిగా వెళ్తున్నందుకు మరో వైపు సంతోషంగా ఉంది. అత్తగారింట్లో పరిస్థితుల్ని అర్థంచేసుకోవడానికి నాలుగైదు రోజులు పట్టింది. సెలవులు అయిపోవచ్చాయి. భర్త కూడా ఉమ లీవు విషయం గుర్తు చేసాడు. మొత్తానికి ఉమ మళ్లీ రొటీన్‌లో పడింది.

పెళ్లయిన తర్వాత పుట్టింటికి, అత్తవారింటికీ తిరగడం, ఉద్యోగ జీవితం... కొంత శ్రమ అనిపించినా ఉమకి ఉత్సాహంగానే ఉంది. కొత్తలో అత్తగారు బాగానే ఆదరించింది. ఏ పనీ చెయ్యనిచ్చేవారు కాదు. తర్వాత నెమ్మదిగా పనులు చెప్పడం మొదలైంది. పనులు చెప్పడమే కాక దెప్పిపొడుపులు కూడా – కోడలు వచ్చినా తనకు సుఖం లేదని మాటల తూటాలు. ఎలుక మీద, పిల్లిమీదా పెట్టి వ్యంగ్యంగా మాటలు – విన్నా విననట్లు సర్దుకుపోతోంది ఉమ. సర్దుకుపోవడానికి అలవాటుపడ్డ ఉమకు అత్త ప్రవర్తన వింతనిపించలేదు.

ఉమ ఆడపడుచు కోమలి పేరులోనే కోమలత్వం. మాటలు, ప్రవర్తన మాత్రం కరకుతనంతో ఉంటాయి. "వదినా! నీకిన్ని చీరలెందుకు? అవున్లే... నువ్వు ఉద్యోగం చేస్తున్నావుగా! రోజుకో చీర ఉండాలిలే..." ఇలా కుళ్లును వెళ్లగక్కుతూ ఉంటుంది.

అత్తగారేమో కూతురితో "ఉద్యోగాలు చేసేవాళ్లకి కాకపోతే నీకూ నాకూ కావాలా కొత్త కొత్త చీరలు? మన బతుకులకు ఒంటిమీద చీర, దండెం మీద చీర తప్ప పెట్టెలో నాలుగు చీరలైనా ఉన్నాయా?" అని ఉమ ముందే అక్కసు వెళ్లగక్కడం – ఉమ అన్నీ గమనిస్తుంది. కానీ సర్దుకుపోతుంది.

ఉమ పెళ్లయి అప్పుడే రెండేళ్లయింది. పండంటి బాబు పుట్టాడు. ఆ బాబుని చూసి ఉద్యోగంలోని కష్టాల్ని, అత్తగారి సతాయింపుల్నీ తేలికగా మర్చిపోతున్నది. ఇంట్లో అన్నీ తానయి పనులు చేసేది.

ఉమ సంతోషం ఎన్నాళ్లో నిలవలేదు. బ్యాంక్ వాళ్లు ఇచ్చిన మెటర్నిటీ లీవ్ అయిపోయింది. మళ్లీ ఉద్యోగానికి వెళ్లాల్సివచ్చింది. కొడుకును వదలాలంటే బాధ. పోనీ 'లాస్ ఆఫ్ పే' మీద కొన్నాళ్లు మానేద్దామంటే భర్త ఒప్పుకోడి. అతన్ని అడగడం కూడా వేస్టే అని భావించి డ్యూటీలో చేరిపోయింది.



*'తెలుగు కార్టూనిస్ట్స్ అసోసియేషన్' ఆవిర్భావ సభలో చలపాక 'చప్ర కార్టూన్లు 2' ను ఆవిష్కరిస్తున్న ప్రముఖ కార్టూనిస్ట్ టీవీ. చిత్రంలో ప్రముఖ కార్టూనిస్ట్ ఎ.వి.ఎం., నది సంపాదకుడు జలదంకి ప్రభాకర్, కార్టూనిస్ట్‌లు రావెళ్ల, టీవీ, చప్ర, కలిమిశ్రీ, మురళీధర్, చక్రవర్తి తదితరులు ఉన్నారు.*

ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఒకటే పని. తను వచ్చేటప్పటికి కొడుకు నిద్రలో ఉంటాడు. పిల్లాడిని ఆడించే సంతోషానికి కూడా దూరమైంది.

ఆదివారమైనా కొడుకుతో సంతోషంగా గడుపు దామంటే మరిది పిల్లవాడిని తనచేతికివ్వడు. వాడే ఎత్తుకు తిరుగుతాడు. ఆడపడుచు, అత్త కూడా పిల్లా డిని నువ్వు చూస్తున్నావా? పెంచుతున్నావా? పొద్దు న్నే వెళ్లి సాయంత్రానికి వస్తావు. అన్నీ అమర్చిపెడితే ఇప్పుడు టింగురంగా అంటూ వస్తావు" అని దెప్పిపొ డుపులు. ఉమకి తన పరిస్థితికి తనమీద తనకే జాలి కలిగింది.

ఉమ ఉద్యోగం చేస్తున్నదే గాని తన జీవితం తాను అనుభవించే పరిస్థితి లేదు. నాసిరకం చీరలు కట్టుకుంటున్నదని కొలీగ్స్ కామెంట్స్...! 'తన జీతా న్ని రామారావు ఏం చేస్తున్నట్లు?' ఉమకి సందేహం!

❄ ❄ ❄

ఆ రోజు ఆదివారం. ఉదయం కాఫీ తాగడం పూర్తిచేసిన రామారావు పేపరు చదువుతూ – ఎవరి తోనో మాట్లాడుతున్నట్లుగా "ఇక రెండు మూడు రోజుల్లో మనం వేరే ఇంటికి వెళదాం. సామాన్లన్నీ సర్దు" అని అనడంతో ఉమకు నోట మాట రాలేదు. కొద్దిసేపు అలాగే ఉండి కొంత తేరుకున్న తరువాత "ఇది మన స్వంత ఇల్లే కదండీ! ఇప్పుడు ఇల్లు మా రడం ఎందుకు?" అమాయకంగా అడిగింది.

"నీమొఖం! నువ్వొక పిచ్చిమాలోకానివి. ఇక్కడ అమ్మావాళ్లు ఉంటారు. మనం వేరే ఇంటికి వెళదాం. ఇక్కడుంటే ఎన్నాళ్లయినా ఇంతే! గొర్రెతోక బెత్తెడు జీవితం. వేరే ఇంటికి వెళదాం. నానిగాడు పెరిగి పెద్దవుతున్నాడు. మనం విడిగా ఉంటే వాడ్ని మంచి కాన్వెంట్‌లో చదివించవచ్చు. కలర్ టి.వి., ఫ్రిజ్, ఎ.సి. లాంటివి కొనుక్కోవచ్చు. ఇన్‌స్టాల్‌మెంట్ పద్ధ తిలో తీర్చుకోవచ్చు" అన్నాడు రామారావు.

భర్త మాటలు ఉమకు వింతగా తోచాయి. "ఇ ప్పుడీ పరిస్థితిలో వీళ్లను వదిలి వెళితే వీళ్లనెవరు చూసుకుంటారు?" అంది భర్తతో.

"ఏమిటీ! అన్ని సమస్యలూ నీకే కావాలా? నెల కింతని ఇద్దాం" అని సర్దిచెప్పబోయాడు.

"అదేమిటి? బాబీ చదువు, గిరిజ పెళ్లి మనమే చూసుకోవాలిగదండీ!" అంది ఉమ.

"చాల్లే నోర్ముయ్! పెద్ద బయలుదేరావ్. నాకే బాధ్యతలు గుర్తుచేస్తున్నావా...?" అని గద్దిస్తూ ఉం డగా –

అంతా వింటున్న అత్తగారు "అదేమిటిరా! ఇంటి కి పెద్దవాడివి నువ్వే ఇలా మాట్లాడితే ఎలా? ఈ వయసులో నేనేమైపోవాలి? పిల్లల బాధ్యత ఎవరు తీసుకుంటారు? అమ్మా ఉమా! నువ్వు మావాడితో ఉంటున్న మాటలన్నీ విన్నాను. నువ్వే మంచి మన సుతో సర్దిచెప్పాలి. నిన్ను అర్థంచేసుకోలేక ఏవేవో మాటలన్నాం. అవేమీ మనసులో పెట్టుకోకుండా మా వాడికి నచ్చచెప్పమ్మా! వాడు చిన్నప్పటి నుంచీ ఇంతే! స్వార్థం తప్ప ఇతరుల్ని పట్టించుకోడు" అంది బాధపడుతూ.

"ఏమండీ! ఒక్కసారి ఆలోచించండి... మనం లేకపోతే వీళ్లకు దిక్కెవరు? ఒకవేళ మనం బయటకు వెళ్లిపోతే అక్కడ మన నానిగాడికి ఎవరు దిక్కు? వాడు ఏ బేబీ కేర్ సెంటర్‌లోనో ఉండాలి. ఇంత స్వార్థం పనికిరాదు. మనకి వీళ్లూ మన నానీ లాంటి వాళ్లే. వీళ్లదారిన వీళ్లని వదిలేస్తే మనల్ని ఎవరూ హర్షించరు. మీరే ఆలోచించండి" అన్న ఉమ పలు కులు రామారావు కళ్లు తెరిపించాయి.

"క్షమించు ఉమా! ఫ్రెండ్స్ ఇళ్లలో కలర్ టి.వి. లు, ఫ్రిజ్‌లు, ఎ.సి.లు చూసి నేనూ మోజు పడ్డా. పర్యవసానం గురించి ఆలోచించలేదు" అంటున్న కొడుకును సుగుణమ్మ ప్రేమతో దగ్గరకు తీసుకుంది. తర్వాత ఉమ చేతులు పట్టుకుని "నీ మంచితనాన్ని మేము గుర్తించలేకపోయాం. నిన్ను కష్టపెట్టినా నా కొడుకుని నాకు దూరం కాకుండా చూసావు. నీ కొడుకుని నీకు దూరం చేయాలని ప్రయత్నించినా నా కొడుకుని నాకు దగ్గరచేసావు. అసలైన తల్లి ప్రేమ అంటే ఏమిటో చూపించావు" అంది.

"నాకు తెలుసు అత్తయ్యా! మీరు ఇవాళ కాకపోతే రేపైనా మారతారని. నా ఆశ తీరింది. నాకదే పది వేలు" అంటూ సంతోషంగా నానీని గుండెలకు హత్తుకుంది ఉమ. ●